ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 333 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 8 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## ఏఐ కోసం రూ. వేల కోట్లు

### కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 7 (ప్రభాత ఉదయం): భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర మంత్రివర్గం గురువారం రూ. 10371.92 కోట్ల బడ్జెట్ వ్యయంతో జాతీయ-స్థాయి 'ఇండియాఏఐ' మిషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రపంచం ఏఐలో దూసుకువెళ్తున్న సమయంలో మన దేశం కూడా ఈ రంగంలో తప్పకుండా ..మిగతా 2లో

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్

### 4 శాతం డీఏ పెంచిన కేంద్రం.. జనవరి 1 నుంచే అమలు



న్యూఢిల్లీ, మార్చి 7 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం అదిరే శుభవార్త అందించింది. డియర్‌నెస్ అలవెన్స్ 4 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగులకు డీఏ 50 శాతానికి చేరుకుంది. పెంచిన డీఏ జనవరి 1, 2024 నుంచే అమలులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అదిరే శుభవార్త అందించింది కేంద్ర ప్రభుత్వం. డియర్‌నెస్ అలెవ్సన్, డియర్‌నెస్ రిలీఫ్ 4 శాతం మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర కేబినేట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు ఉద్యోగులుక డీఏ 4 శాతం పెంచుతూ 50 శాతానికి చేర్చినట్లు వెల్లడించారు. పెంచిన డీఈ 4 శాతం జనవరి1 , 2024 నుంచే అమలులోకి వస్తుందని తెలిపింది. వచ్చే నెల శాలరీలో ..మిగతా 2లో

## జమ్మూ కశ్మీర్‌లో మోదీ పర్యటన

### వేల కోట్ల విలువైన కీలక ప్రాజెక్ట్‌లు ప్రారంభం



జమ్ముకశ్మీర్, మార్చి 7 (ప్రభాత ఉదయం): ఆర్టికల్ 370 రద్దు తరవాత తొలిసారి జమ్ముకశ్మీర్లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ మొత్తం 53 ప్రాజెక్టకు ప్రారంభించారు. మొత్తం రూ.6,400 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టను జాతికి అంకితం చేశారు. శ్రీనగర్లోని బక్షి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రారంభించారు. వికసిత్ భారత్ వికసిత్ జమ్ముకశ్మీర్ అజెండాతో ఈ సభను ఏర్పాటు చేసింది బీజేపీ. ఈ సభలో జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ఉన్నారు. అంతకు ముందు ప్రధాని మోదీ లోకల్ ప్రొడక్ట్స్ ఎగ్జిబిషన్ని సందర్శించారు. కశ్మీర్లో పర్యాటక రంగంపై దృష్టి సారించిన మోదీ సర్కార్...లో భాగంగా రూ.1,400 కోట్ల విలువైన ప్రాజెక్ట్ని ప్రారంభించారు. స్కీమ్ని లాంఛ్ చేశారు. ఇదే కార్యక్రమంలో దాదాపు వెయ్యి మందికి ప్రభుత్వ ఉద్యోగులకు అపాయింట్మెంట్ లెటర్స్ ..మిగతా 2లో

# ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం శంకుస్థాపన





హైదరాబాద్, మార్చి 7 (ప్రభాత ఉదయం): సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాజీవ్ రహదారి ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణతో ఈ ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. ప్రజల అవసరాన్ని మర్చిపోయి గత ప్రభుత్వం కేంద్రంతో గిల్లికజ్జాలు పెట్టుకుని ప్రాజెక్టును పక్కనబెట్టిందన్నారు. మేం ..మిగతా 2లో

## చదువు మీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి

2





2

## మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు



## 10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

### ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ

### సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

న్యూఢిల్లీ, మార్చి 7 (ప్రభాత ఉదయం): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై తొలి విడత కసరత్తును ఏఐసీసీ అగ్ర నాయకత్వం పూర్తి చేసింది. తెలంగాణలోని సుమారు పది స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసింది. ప్రాంతీయ, కుల సమీకరణలు, రాజకీయ నేపథ్యం, సర్వేల్లో విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. అభ్యర్థుల ప్రకటన ఏక్షణమైనా వెలువడవచ్చని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లిలో గడ్డం వంశీ, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి, నిజా మాబాద్‌లో టి.జీవన్‌రెడ్డి, మహబూబాబాద్‌లో బల రాంనాయక్, చేవెళ్లలో సునీత మహేందర్‌రెడ్డి, నల్ల గొండలో రఘువీర్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డిల పో టీకి ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేక పోవ డంతో వారి అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపి నట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానానికి సురేశ్ షెట్కా ర్, ఉ జ్వల్‌రెడ్డిల పేర్లను పరిశీలించినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు గురువారం సాయంత్రం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఏఐసీసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదిత రులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియో జ కవర్గాల నుంచి పరిశీలనలోకి వచ్చిన అభ్యర్థుల వివరాలు, స్క్రూటినీ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సీఈసీ ముందుంచారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివే దికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. మొదటగా సింగిల్ పేర్లతో కూడిన స్థానాలను కమిటీ పరిశీలించింది. మొత్తంగా 8-10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు. మిగతా స్థానాలపై కూడా చర్చించినా, మరోమారు సమావేశమై సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేద్దామనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో ఇటీవలే పార్టీలో చేరిన బొంతు రామ్మో హన్ దంపతులు, నాగర్‌కర్నూల్‌లో మల్లురవి, సంపత్ కుమార్, వరంగల్‌లో దారా సాంబయ్య సహా మరో పేరు, మల్కాజిగిరిలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, ఆదిలాబాద్‌లో ఆదివాసీలైన ఇద్దరి పేర్లపై చర్చి జరిగినట్లు తెలిసింది. ఆయా స్థానాలపై వచ్చే వారంలో తుది నిర్ణయం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు.

## శివరాత్రి తర్వాతే బీజేపీ రెండో జాబితా

### ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్



హైదరాబాద్, మార్చి 7 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ ఎన్నికలకు గాను అన్ని పార్టీల కంటే ముందు భారతీయ జనతా పార్టీ తెలంగాణలో 9 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల టూర్‌తో ఫుల్ జోష్‌లో ఉంది కాషాయ పార్టీ. సెకండ్ లిస్ట్ ఎప్పుడు ప్రకటిస్తారా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. పెండింగ్ స్థానాలపై అధిష్టానానికి క్లారిటీ వచ్చిందా..? ఎన్నికల కమిటీకి చేరిన జాబితాలో ఎవరి పేర్లున్నాయన్నదీ ఉత్కంఠగా మారింది. ఇప్పటికే 9 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాషాయ పార్టీ.. రెండో విడుతలో మిగిలిన 8 స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. రాష్ట్ర నాయకత్వం కొన్ని పార్లమెంట్ స్థానాలకు రెండు, మూడు పేర్లతో జాబితా అధిష్టానానికి అందించింది. మరికొన్ని లోక్ సభ స్థానాల్లో పార్టీకి బలమైన అభ్యర్థులు లేకపోవడంతో డైలమాలో పడినట్లు తెలుస్తోంది. వరంగల్, నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, పెద్దపల్లి స్థానాల్లో పార్టీ చాలా బలహీనంగా ఉంది. అయితే ఆ స్థానాల్లో ఇతర పార్టీల నుంచి నేతలకు గాలం వేసి వారికి టికెట్లు కేటాయించాలని పార్టీ భావిస్తోంది. చేరికల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముందని చర్చ జరుగుతోంది. అనుకున్న సమయంలోగా జాయినింగ్స్ పూర్తయితే మిగిలిన 8 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ లోపే అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలని ..మిగతా 2లో

## 'రేవంత్ సర్కారు ఐదేళ్లు ఉండాల్సిందే'

### ప్రభుత్వాన్ని పడగొట్టే వాళ్లు కాంగ్రెస్‌లోనే ఉన్నారంటూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్, మార్చి 7 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి పక్కనే మానవ బాంబులు ఉన్నారంటూ మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రేవంత్ సర్కారు ఐదేళ్లు నిక్షేపంగా ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బయటి నుంచి ఎవరో కూల్చరని.. ప్రభుత్వాన్ని పడగొట్టే వారు ఆ పార్టీలోనే ..మిగతా 2లో



# చదువు మీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి

హైదరాబాద్, మార్చి 7 (ప్రభాత ఉదయం): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో సంస్కరణలకు కృషి చేశారన్నారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన గాంధీ కుటుంబంతో, కాంగ్రెస్ పార్టీతో కొనసాగారని ఆయన వ్యాఖ్యానించారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు విడి విడిగా ఉండేవని, దళితులు, గిరిజనులు, బీసీ మైనార్టీలందరికీ ఒకేచోట ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా అధికారులను ఆదేశించామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతీ నియోజకవర్గంలో ఒకే క్యాంపస్ లో గురుకులాలన్నీ ఉండేలా ఏర్పాటు చేసి కులాల మధ్య అంతరాలు చెరిపేయాలనుకుంటున్నామని, పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ లో శంకుస్థాపన చేసామన్నారు. అంతేకాకుండా..'చదువుమీద పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి.. చదువుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆకునూరి మురళి లాంటి వారికి చదువుకుంటేనే గుర్తింపు, గౌరవం వచ్చాయి. లోక్ సభ స్పీకర్ గా తెలంగాణ బిల్లును ఆమోదించింది జగ్జీవన్ రామ్ కూతురు మీరాకుమారి. తెలంగాణ రాష్ట్రమంతా మీరా కుమారిని ఎప్పుడూ గుర్తుచేసుకుంటుంది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. ఒకసారి దొరల చేతిలో ఉంటే.. ఒకసారి దళితుల చేతుల్లో ఉంటుంది. దొరలకు ఇష్టం ఉన్నా లేకున్నా ఇవాళ అసెంబ్లీలో గడ్డం ప్రసాద్ గారిని అధ్యక్షా అని పిలవాల్సిందే.. కొందరు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు.



అసలు ఆ ప్రశ్నించే హక్కును, అధికారాన్ని కల్పించింది కాంగ్రెస్ పార్టీనే.. చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దు చదువే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత శిఖరాలకు ఎదగండి' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు..

# హైకోర్టులో రేవంత్ సర్కార్‌కు ఎదురు దెబ్బ



హైదరాబాద్, మార్చి 7 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎమ్మెల్సీల నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. శాసనమండలిలో గవర్నర్ కోటాలో ఇద్దరు సభ్యుల నియామకానికి సంబంధించి తీర్పును వెల్లడించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమించిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణల నియామకాన్ని కొట్టి వేసే అధికారం గవర్నర్‌కు లేదని హైకోర్టు పేర్కొంది. కేబినెట్‌కు తిప్పి పంపాలి తప్ప తిరస్కరించకూడదని అభిప్రాయపడింది. మళ్లీ కొత్తగా ఎమ్మెల్సీల నియామకం చేపట్టాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది . మరోసారి ఎమ్మెల్సీల పేర్లను మళ్లీ కేబినెట్‌లో ప్రతిపాదించి గవర్నర్‌కు పంపాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే తెలంగాణ హైకోర్టు.. కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు కోదండరాం, ఆమీర్ అలీఖాన్‌ల నియమిస్తూ జారీ చేసిన గెజిట్‌ను కూడా కొట్టేసింది. హైకోర్టు తీర్పు ప్రకారం.. రేవంత్ సర్కార్ మరోసారి ఎమ్మెల్సీల నియామకం చేపట్టాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణను కేబినెట్ నామినేట్ చేసింది. ఈ ఇద్దరి పేర్లను ఆమోదించాలని గవర్నర్ తమిళి సైకు పంపారు. గవర్నర్ మాత్రం ఈ ఇద్దరి పేర్లను తిరస్కరించారు.. ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసేందుకు అర్హతలు లేవన్నారు. దీంతో నియామక ప్రక్రియ అక్కడే నిలిచిపోగా.. ఇంతలో గతేడాది ఎన్నికలు జరగ్గా.. బీఆర్ఎస్ ఓడింది, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే తమ పేర్లను గవర్నర్ ఎమ్మెల్సీలుగా ఆమోదించకపోవడాన్ని దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు హైకోర్టులో సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని పిటిషన్‌లో కోర్టుకు వివరించారు. కేబినెట్ నిర్ణయాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్‌కు లేదన్నారు.. హైకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది. ఇంతలో ప్రొఫెసర్ కోదండరామ్, ఆమీర్ అలీఖాన్ పేర్లను కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాకు ప్రతిపాదించింది. ఈ సిఫార్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు.. హైకోర్టులో తమ పిటిషన్ పెండింగ్ లో ఉండగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఆమోదించడంపై దాసోజు శ్రవణ్ , సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ వరకు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం చేపట్టొద్దని హైకోర్టు ఆదేశించింది. తాజాగా తీర్పును వెల్లడించింది.. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చూడాలి.



### జమ్మూ కశ్మీర్‌లో

# మోదీ పర్యటన

**మొదటి పేజీ తరువాయి...**

అందించారు ప్రధాని నరేంద్ర మోదీ. అంతే కాదు. పలు పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. రైతులు, వ్యాపారులతోనూ ముచ్చటించారు. ఉద్యోగావకాశాలపై స్థానిక యువతతో ముఖాముఖి మాట్లాడారు. "జమ్మూకశ్మీర్లో అభివృద్ధి ప్రాజెక్టు ఇవాళ జాతికి అంకితం చేసుకున్నాం. జమ్మూకశ్మీర్ అభివృద్ధి అనేది మాకు ఎప్పటికీ ప్రాధాన్యతే. ఎన్నో ఏళ్ల పాటు ఇక్కడి ప్రజలు ఎలాంటి పురోగతికి నోచుకోలేదు. దేశమంతా పథకాలు అమలైనా ఇక్కడి ప్రజలు మాత్రం చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ ఇప్పుడా పరిస్థితులు మారిపోయాయి. కాంగ్రెస్ ఇక్కడి ప్రజల్ని తప్పుదోవ పట్టించింది. ఆర్టికల్ 370 పైనా ఇదే విధంగా తప్పుడు ప్రచారం చేసింది" ఇదే సభలో కీలక వ్యాఖ్యలు చేశారు ప్రధాని మోదీ.

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్

**మొదటి పేజీ తరువాయి...**

ఎరియర్స్ కలిపి చెల్లించనుంది కేంద్రం. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వచ్చే నెల నుంచి జీతాలు, పెన్షన్ భారీగా పెరగనున్నాయి. మరోవైపు.. డీఏ పెంపుతో పాటు గ్యాట్యూటీ, ఇతర అలెవన్సులు సైతం పెంచుతున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే, దీనిపై కేంద్ర మంత్రి ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కానీ, కేబినెట్ నిర్ణయాలు పూర్తి స్థాయిలో బయటకు వస్తే స్పష్టత రానుంది. ఏదేమైనా సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రం ఉద్యోగులకు అదిరే శుభవార్త అందించిందని చెప్పవచ్చు. మరోవైపు.. కేబినెట్ కీలక నిర్ణయాల్లో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ సబ్సిడీ స్కీమ్ ఉజ్వల యోజన ద్వారా అందిస్తున్న రూ.300 సబ్సిడీ పథకాన్ని 2025, మార్చి 31 వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. దీని ద్వారా కేంద్రంపై అదనంగా మరో రూ.12 వేల కోట్లు భారం పడుతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మరోవైపు.. 2024-25 సీజన్ కి సంబంధించి జూట్ కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు తెలిపారు. క్వింటాలుకు రూ.285 పెంచినట్లు తెలిపారు. దీంతో క్వింటాలు జూట్ ధర రూ. 5,335కు చేరింది.

# శివరాత్రి తర్వాతే బీజేపీ రెండో జాబితా

**మొదటి పేజీ తరువాయి...**

బీజేపీ అధిష్టానం భావిస్తోంది. మొదటి జాబితాలో పలువురు సీనియర్లు టికెట్ ఆశించి భంగపడ్డారు. మహబూబ్ నగర్ స్థానం లో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు లైన్ క్లియర్‌గా ఉన్నప్పటికీ అధిష్టానం తొలి జాబితాలో ఛాన్స్ ఇవ్వలేదు. కొత్త వారికి పార్టీ అవకాశం కల్పించింది. కానీ వేరే పార్టీ నుంచి చేరిన ఒకటి రెండు రోజుల్లోనే ఇద్దరు నేతలు టికెట్ అందుకున్నారు. దీంతో మిగిలిన 8 స్థానాల్లో కొత్త వారికి అవకాశం కల్పిస్తారా? లేక పాత వారికి అవకాశం కల్పిస్తారా? అన్న ప్రశ్న అందరి మెదళ్లను తొలచివేస్తోంది. జహీరాబాద్ స్థానాన్ని ఆశించి భంగపడిన ఆలె భాస్కర్ మెదక్ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఎందుకంటే ఆయన తండ్రి ఆలె నరేంద్ర మెదక్ ఎంపీగా పనిచేశారు. దీంతో వారి కుటుంబానికి ఆ ప్రాంతానికి ఉన్న అనుబంధం కారణంగా ఆలె భాస్కర్ మెదక్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ స్థానం కోసం రఘునందన్ రావు, అంజిరెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా మిట్టపల్లి సురేందర్‌కు పెద్దపల్లి టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయ్యారు. టికెట్ తనకిస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్న తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, పెద్దపల్లి టికెట్ ను సీనియర్ అయిన ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ సైతం ఆశిస్తున్నారు. అదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు తొలి జాబితాలో ఛాన్స్ దక్కలేదు. రెండో జాబితాలో అతనికే ఛాన్స్ ఇస్తారా? కొత్త వ్యక్తిని తెరపైకి తెస్తారా ? అన్నది ఆసక్తికరంగా మారింది. మార్చి 8వ తేదీన ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరగనుంది. ఈ మీటింగ్ తర్వాత ఏ క్షణాన అయినా అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చేరికలను త్వరగా పూర్తి చేయాలని పార్టీ ప్లాన్ చేస్తోంది. తెలంగాణలో అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలనుకుంటున్న కమలనాథుల ఈక్వేషన్స్ ఏ మేరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి..!

# ఏఐ కోసం రూ. వేల కోట్లు

**మొదటి పేజీ తరువాయి...**

ఎదగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పలుమార్లు ప్రస్తావించారు. నేడు దీనికి సంబంధించిన కీలక నిర్ణయం తీసుకోవడం జరిగింది. మేకింగ్ ఏఐ వర్క్ ఫర్ ఇండియా అనే విజన్‌తో మన దేశంలో కూడా టెక్నాలజీ పెరగాలని క్యాబినెట్ భారీ బడ్జెట్ ప్రకటించింది. ఇండియాఏఐ మిషన్ సామాజిక ప్రయోజనం కోసం విప్లవాత్మక సాంకేతికత అనువర్తనాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి సహాయపడుతుంది. భారత్ ప్రపంచంలో పోటీ పడటానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

# ఈసారి ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా: బండి సంజయ్



కరీంనగర్, మార్చి 7 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. తెలంగాణలో రాజకీయాలు భగ్గుమంటున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల నేతల మధ్య విమర్శలు ఘాటెక్కుతున్నాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తుండగా.. తామేమి తక్కువ కాదన్నట్టుగా బీజేపీ నేతలు గళం కలుపుతున్నారు. ఈ క్రమంలోనే.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సంచలన కామెంట్లు చేశారు. తనపై కీలక వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బండి సంజయ్.. ఛాలెంజ్ విసిరారు. కరీంనగర్‌కు ఎవరు ఏం చేశారో చర్చించేందుకు తాను సిద్ధమని కేటీఆర్‌కు సవాల్ విసిరారు బండి సంజయ్. అభివృద్ధి, రామమందిరంపై ఎన్నికలకు వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు. కాగా.. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను గెలిస్తే బీఆర్ఎస్ పార్టీని మూసేస్తారో లేదో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోకపోతే కరీంనగర్‌లో తిరగలేరు అంటూ బండి సంజయ్ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే.. కరీంనగర్‌లో బండి సంజయ్ వర్సెస్ మంత్రి పొన్నం ప్రభాకర్‌గా మాటల యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. తమతో పాటు తమ తల్లులను కూడా ఈ విమర్శల్లోకి తీసుకురావటంతో.. అది కాస్తా వివాదాస్పదంగా మారింది. మొదట రాజకీయ సన్యాసం సవాళ్ల నుంచి చివరికి క్షమాపణ చెప్పేవరకు కొనసాగింది. కాగా.. మళ్లీ కేటీఆర్ కూడా కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ ఏమీ చేయలేదని.. కేవలం రాముడి పేరుతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారంటూ అవే కామెంట్లు చేయగా.. మరోసారి సవాళ్ల పర్వం మొదలైంది.

# 'రేవంత్ సర్కారు ఐదేళ్లు ఉండాల్సిందే'

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నారంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ సహా బీజేపీ నేత బండి సంజయ్ పైనా విమర్శలు గుప్పించారు. 'రేవంత్ రెడ్డి బీపీ పెంచుకోకు. నీ ప్రభుత్వాన్ని కూల్చం. ఐదేళ్లు నువ్వు అధికారంలో ఉండాలని కోరుకుంటాం. అప్పుడే వెలుగు చీకట్లకు తేడా తెలుస్తుంది. మీ ప్రభుత్వాన్ని కూల్చే ఖమ్మం, నల్గొండ మానవ బాంబులు మీ పార్టీలోనే ఉన్నాయి. నీకు ఫ్రస్టేషన్ ఎక్కువైంది. ఎన్నికలయ్యాక తమ ఎమ్మెల్యేలతో బీజేపీలో కలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై ఉన్న కోపాన్ని రైతులపై తీర్చుకుంటోంది. ఇంతకీ అబద్ధపు 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారు.?' అని కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్ అంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఓ సెంటిమెంట్ అని.. ఇక్కడి నుంచే ఎన్నో పోరాటాలకు శ్రీకారం చుట్టారని కేటీఆర్ అన్నారు. ఆనాడు ఆంధ్రా పాలకులకు వ్యతిరేకంగా ఇక్కడి నుంచే జంగ్ సైరన్ మోగించారని.. ఇప్పుడు అబద్ధాల సీఎం రేవంత్ రెడ్డి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 'పాలమూరు సభలో సీఎం రేవంత్ భాష నాకు అర్థం కాలేదు. మానవ బాంబై పేలుతా అంటున్నారు. ఆయన పక్కనే మానవ బాంబులు ఉన్నాయి. బీఆర్ఎస్ నుంచి ఆయనకు ఎలాంటి ప్రమాదం ఉండదు. రేవంత్ ఐదేళ్ల పాలన చూశాక ఎవరు గొప్పవాళ్లో ప్రజలకు తెలుస్తుంది. ఇది కాలం తెచ్చిన కరువు అని సీఎం అంటున్నారు. కానీ, కాంగ్రెస్ తెచ్చిన కరువు. మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసి నీళ్లు ఇవ్వొచ్చు. కానీ అలా చేయడం లేదు. కేసీఆర్ ను బద్నాం చేయాలనే చూస్తున్నారు.' అంటూ కేటీఆర్ మండిపడ్డారు. కరువు మీద కేసీఆర్ సంధించిన బ్రహ్మాస్త్రమే కాళేశ్వరం ప్రాజెక్ట్ అని వివరించారు. బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తూ.. తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటేస్తే అది బీజేపీ గెలుపునకే కారణమవుతుందనేది అంతా గమనించాలని అన్నారు. ఎన్నికల తర్వాత రేవంత్ మరో ఏక్ నాథ్ షిండే, హిమంత బిశ్వశర్మ కాబోతున్నారనేది గ్యారెంటీ అంటూ ఎద్దేవా చేశారు. 'మరో 10 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వంద రోజులు పూర్తవుతుంది. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. మగాడివైతే ఒక్క సీటు గెలిపించుకోవాలని సీఎం రేవంత్ నాకు సవాల్ చేశారు. ఇద్దరం రాజీనామా చేసి మల్కాజిగిరిలోనే తేల్చుకుందాం అంటే చడీ చప్పుడు లేదు.' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఎప్పుడు ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చొక్కారావు, బద్దం ఎల్లారెడ్డి, కేసీఆర్ వంటి మహానుభావులు ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించారని గుర్తు చేశారు. ఐదేళ్లు ఎంపీగా ఏం చేశారో చెప్పాలని బండి సంజయ్ ను నిలదీశారు. గత పదేళ్లలో ఐదేళ్లు వినోద్ కుమార్ ఎంపీగా ఉన్నారని.. మరో ఐదేళ్లు బండి సంజయ్ ఎంపీగా ఉన్నారని, కేంద్రంలో పదేళ్లు మోదీ ప్రధానిగా ఉన్నారని అన్నారు. ఈ పదేళ్లలో కరీంనగర్ కు ఎవరు ఏం చేశారో.? తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. డేట్ అండ్ టైం ఫిక్స్ చేయాలని.. ప్లేస్ మాత్రం కరీంనగర్ కమాన్ అని చెప్పారు. ఎంపీ నిధులు ఖర్చు పెట్టడం చేతకాని వారు ఎంపీగా ఎందుకు ఉండాలని మండిపడ్డారు. వచ్చే ఏడాదంతా ఎన్నికలే ఉంటాయని.. పార్లమెంట్ తర్వాత, పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ ఎన్నికలు ఉంటాయని కేటీఆర్ వివరించారు. ఆ ఎన్నికల్లో అందరినీ గెలిపించుకునే బాధ్యత తమదే అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

### మార్చి 15 నుంచి

# ఒంటి పూట బడులు

## సర్క్యులర్ జారీ

హైదరాబాద్, మార్చి 7 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మార్చి ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 4 డిగ్రీల మేర పెరిగినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వేసవి ప్రారంభానికి ముందు రాష్ట్రంలో 32 నుంచి 37 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ తరుణంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పగటిపూట ఎండలు తీవ్రంగా ఉండడంతో తెలంగాణలో హాఫ్ డే స్కూళ్లను నడపాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. మార్చి 15 నుంచి రాష్ట్రంలోని పాఠశాలల్లో ఒకరోజు తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూల్.. 12.30కి మధ్యాహ్న భోజనం.. 10వ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ లో మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ నడవనుంది. అయితే 10వ తరగతి కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పాఠశాలల్లో ముందుగా మధ్యాహ్న భోజనం అందించి ఆ తర్వాత తరగతులు కొనసాగుతాయి. 10వ తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత యథావిధిగా ఉదయం తరగతులు నిర్వహిస్తామని.. విద్యార్థుల పరీక్షల అనంతరం వేసవి సెలవులపై ప్రకటన చేస్తామని విద్యాశాఖ తెలిపింది.

# ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం శంకుస్థాపన

**మొదటి పేజీ తరువాయి...**

అధికారంలోకి రాగానే కేంద్రంతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. ప్రధాని మోదీని, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ ను కలిసి ప్రాజెక్టు అవసరాన్ని వివరించామని సీఎం చెప్పారు. భూముల కేటాయింపు, చాంద్రాయణగుట్ట రక్షణ శాఖ భూముల లీజ్ రెన్యూవల్ చేయకుండా గత ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అధికారంలోకి రాగానే తక్షణమే మేం అధికారులతో సమీక్షించి రక్షణ శాఖకు భూములు అప్పగించామన్నారు. ఎలివేటేడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో కేంద్రం రాష్ట్రానికి సహకరించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ దిక్కుమాలిన విధానాలతో ప్రజలకు శిక్ష పడిందని విమర్శించారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందాలంటే ఎలివేటేడ్ కారిడార్ పూర్తవ్వాలన్నారు. ప్రజల అవసరాల కోసమే ఒక మెట్టు దిగా.. రాజకీయాల కోసం కాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఏదైనా ఒక శాశ్వత అభివృద్ధి చేశారా అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ నగరంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ పాలనలోనేనని సీఎం తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గంజాయి, డ్రగ్స్, పబ్బులు తప్ప ఏం రాలేదని విమర్శలు గుప్పించారు.

# బెంగళూరులో గుక్కెడు నీళ్ల కోసం కటకట..

## ఒక్కో వాటర్ క్యాన్ ధర రూ.2 వేలకు పైమాటే!

బెంగళూరు, మార్చి 7: వేసవి ఆరంభంలోనే బెంగళూర్‌లో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. గుక్కెడు తాగునీటి కోసం నగరవాసులు కటకటలాడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బోర్‌వెల్స్ ఎండిపోవడంతో నీటి సంక్షోభం తారాస్థాయికి చేరుకుంది. స్థానికులు నీటి కోసం వాటర్ ట్యాంకర్లపై ఆధారపడటంతో.. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ ట్యాంకర్లు ఇష్టారీతిన అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో వాటర్ క్యాన్‌కు రూ.600 నుంచి రూ. వెయ్యి రూపాయలు ప్రైవేట్ ట్యాంకర్లు ప్రస్తుతం ఏకంగా రూ.2 వేలకు పెంచాయి. ధరలు తగ్గించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం వారిని కోరడంతో అసలు ప్రాంతానికి రావడమే మానేశారు. దీంతో స్థానికులు ప్రతిరోజూ నీళ్ల కోసం ఆర్ఓ ప్లాంట్‌కు వెళ్లాల్సి వస్తోందని, అక్కడ ఒక్కొక్కరికి ఒక్కో క్యాన్ చొప్పున మాత్రమే ఇచ్చేందుకు అనుమతిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. నీటి కోసం పొడవాటి క్యూల్లో గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని ఆర్ఆర్ నగర్ వాసులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించడం లేదని, కొద్దిపాటి నీటితోనే ఇంట్లో వారంతా సర్దుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. స్నానం చేసేందుకు, వంట చేసుకునేందుకు కూడా తగినంత నీరు ఉండటం లేదని అన్నారు. వంట చేసేందుకు కార్పొరేషన్ నీటిని వినియోగించుకోవాల్సి వస్తోందని, ఆ నీటిని వడపోసి మరిగించి.. తాగేందుకు వినియోగిస్తున్నట్లు ఆర్ఆర్ నగర్‌కు చెందిన మహిళ దివ్య నీటి కష్టాలను ఏకరువు పెట్టారు. గత మూడు నెలలుగా నీటి కొరత వెంటాడుతోందని, తాము నిత్యం బీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ (బెంగళూర్ నీటి సరఫరా, సీవరేజ్ బోర్డ్) అధికారికి ఫోన్ చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని చెప్పారు. కనకపుర రోడ్‌లోని ప్రెస్టీజ్ ఫాల్కన్ సిటీ అపార్ట్‌మెంట్స్ నివాసితులు నీటిని పొదుపు చేయడానికి పునర్వినియోగించలేని వస్తువులను ఉపయోగించాలని కోరింది. నీటి సంక్షోభాన్ని పర్యవేక్షించేందుకు వైట్‌ఫీల్డ్‌లోని మరో సొసైటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించకుంటే రూ.5,000 జరిమానా విధించాలని వారు నిర్ణయించారు. మరోవైపు బెంగళూరులోని నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ట్యాంకర్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గత వారం చెప్పారు. సమస్య పరిష్కారానికి (బృహత్ బెంగళూరు మహానగర పలికే) సభ్యులు సమావేశమై బెంగుళూరులోని అన్ని వాటర్



ట్యాంకర్లను మార్చి 7వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. వారందరితో మార్చి 12న సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అక్కడి నీటి కొరతను ఎదుర్కొనేందుకు తాలూకా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు.



జర్నలిస్టుల క్రీడా పోటీల సందర్భంగా
ప్రథమ బహుమతి గెలుచుకున్న అప్పారెడ్డి గూడెం మాధవి



బహుమతి పొందిన ఎం తారుణ్య



జర్నలిస్టుల క్రీడా పోటీల అతిథులతో అన్న దాత గద్దె యాదగిరి

# చరిత్రలో స్త్రీల స్థానం ప్రత్యేకం!



జలమండలిలో జరిగిన మహిళ దినోత్సవం లో ప్రసంగిస్తున్న జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా అధికారులు, ఉద్యోగులు

## జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి

సిటీ బ్యూరో, మార్చి 7(ప్రభాత ఉదయం) ఏ చరిత్ర తీసుకున్నా.. స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందని ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ సి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడ, మగ అనే తేడా ఆలోచనల్లో కూడా ఉండకూడదన్నారు. సృష్టించే శక్తి మహిళలకే ఉందని కొనియాడారు. మహిళల కోసం అనేక చట్టాలున్నాయని.. కానీ వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. ఫిన్లాండ్ లాంటి దేశాల్లో చట్టసభల్లో అత్యధిక శాతం మహిళలే ఉన్నారని తెలిపారు. మనదేశంలోనూ అనేక విభాగాల్లో స్త్రీలదే పై చేయిగా ఉందని పేర్కొన్నారు. ఒలింపిక్స్ లో అత్యధిక మెడల్స్ సాధించిన ఘనత మహిళల సొంతమన్నారు. కల్పనా చావ్లా లాంటి వనితలు ఆస్ట్రోనాట్ రంగంలో రాణించిన విషయం గుర్తు చేశారు. ఈ కాలపు మహిళలు కూడ.. వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.



మరో ముఖ్య అతిథిగా హాజరైన రాఖీ కంకారియా మాట్లాడుతూ.. మహిళలు శక్తి స్వరూపులు అన్నారు. వారు లేకుంటే సృష్టే లేదన్నారు. వ్యక్తిగత, ఉద్యోగ ప్రయాణంలో వచ్చే అడ్డంకులన్నీ తొలగించుకుంటూ.. సొంత బలంతో విజయ పథంలో దూసుకెళ్లాలన్నారు. అనంతరం.. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, జలమండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏజే సుగంధిని, జనరల్ సెక్రటరీ బిల్కిస్ భాను, యాక్టింగ్ అర్చనా వెంకటరెడ్డి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణ, ఇతర మహిళ ఉద్యోగులు స్రవంతి, ఉష, మౌనిక మానస, సిబ్బంది పాల్గొన్నారు.



ఉమెన్ లీడర్ షిప్ అవార్డు - 2024 ను అందుకుంటున్న గుత్తికొండ అనీజ

## నార్మ్ ప్రిన్సిపల్ టెక్నీకల్ ఆఫీసర్ గుత్తికొండ అనీజకు ఉమెన్ లీడర్ షిప్-2024 అవార్డు

**బుద్వేల్, మార్చి 7(ప్రభాత ఉదయం) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హై బీజ్ టీవీ వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళను గురువారం నగరంలోని నోవాటేల్ హెచ్ ఐ సి సి లో సన్మానించి అవార్డులను అందజేశారు . ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ గా , ప్రజా సంబంధాల అధికారినిగా విధులు నిర్వహిస్తున్న గుత్తికొండ అనీజ ఉమెన్ లీడర్షిప్ అవార్డు - 2024 ను అందుకుంది. టెక్నికల్ , అగ్రికల్చరల్, ఎంటర్ ప్రెన్యూర్ షిప్, బిజినెస్ మేనేజ్మెంట్ ఇలా అనేక రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గుత్తికొండ అనీజ ప్రతిభను చూసి హై బీజ్ టీవీ ఈ అవార్డుతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా గుత్తికొండ అనీజ మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ లీడర్షిప్ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు**

## ఫేక్ ఇన్‌స్టా గ్రామ్ ద్వారా ప్రత్యర్థిని పిలిపించి హత్య చేసిన దుండగులు

బుద్వేల్, మార్చి7(ప్రభాత ఉదయం) : ఫిబ్రవరి 25వ తేదీన షాహిన్ నగర్ లో జరిగిన జగినేక రాత్ సందర్భంగా జరిగిన గొడవ ఓ యువకుని ప్రాణాన్ని బలితీస్తుంది . ఇద్దరూ స్నేహితుల మధ్య జరిగిన ఈ గొడవను మనుసులో పెట్టుకున్న ఓ యువకుడు మరో ఐదు మంది స్నేహితులతో కలిసి తనతో గొడవపడ్డ యువకుడ్ని పథకం ప్రకారం పిలిపించి హత్య చేశాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి...... షాహిన్ నగర్ బిస్మిల్లా కాలనీ కి చెందిన యూసుఫ్ కుమారుడు పెయింటర్ గా పనిచేసే మహమ్మద్ ఫహీమ్( 20) కు అదే కాలనీలో ఉంటూ ప్రస్తుతం కాలపత్తార్ అంజదుల్ల బాగ్ బాయ్స్ టౌన్ స్కూల్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ యాసిన్(22) తో ఫిబ్రవరి25 న జరిగిన జగ్ నేకా రాత్ సందర్భంగా గొడవ పడ్డాడు. ఈ విషయమై మహమ్మద్ ఫయీమ్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో రాజీ కుదురుచ్చారు . అది మనసులో పెట్టుకున్న మొహమ్మద్ యాసీన్ ఎలాగైనా మొహమ్మద్ ఫహీంను అంతమొందించాలని కుట్ర పన్ని కాలా పత్తర్ కు చెందిన ఓబాది ఖురేషి , షాహీ నగర్ కు చెందిన మహమ్మద్ అబ్దుల్ మీనాజ్, ఫలక్ నుమా ప్రాంతానికి చెందిన మొహమ్మద్ కయ్యుమ్, మొహమ్మద్ ఫహీమ్ ల తో కలసి మొహమ్మద్ ఫహీం పై దాడి చేయాలనుకున్నారు. అందులో భాగంగా నేహా ఖాన్ అనే యువతి పేరుతో ఓ ఇంస్టాగ్రామ్ క్రియేట్ చేసి అందులో అందమైన యువతి ఫోటోలు పెట్టి మహమ్మద్ ఫహీంతో చాటింగ్ చేయడం మొదలుపెట్టాడు . అలా చాటింగ్ చేస్తూ ఈనెల 5 వ తేదీన చింతల్మేట్ ఎం ఎం పహాడీలో ఉన్న దర్గా వద్దకు రమ్మని చెప్పాడు. నిజంగానే యువతి చాటింగ్ చేస్తుందేమో అని భావించిన మహమ్మద్ ఫహీం తన బైక్ పై ఎం ఎం పహాడి వచ్చాడు. అక్కడ స్నేహితులతో కాపు కాచిన మొహమ్మద్ యాసిన్ కత్తులతో ధారణంగా మహమ్మద్ ఫహీంను పొడచి ఆ తర్వాత బండరాయితో మోదీ హత్య చేశారు . ఈ విషయాన్నీ తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ , అడిషనల్ డీసీపీ విజయకుమార్ , ఏసీపి టీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి , ఎస్ ఓ టి ఇన్స్పెక్టర్ రమణారెడ్డిలో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితులు మహమ్మద్ యాసీన్ , ఒబాది ఖురేషి , మొహమ్మద్ అబ్దుల్ మీనాజ్ , మహమ్మద్ కయ్యుమ్, మహ్మద్ ఫహీం లను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్ తరలించారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కత్తి, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు



వివరాలను వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్



భారీ శివుడి విగ్రహం వద్ద కుమారుడు కార్తీక్ రెడ్డి తో మాజీ మంత్రి సబితా రెడ్డి

## మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

రాజేంద్రనగర్,మార్చి07(ప్రభాత ఉదయం) మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి,ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి,ఇంద్రరెడ్డి ట్రస్ట్ చైర్మన్ పి.కార్తీక్ రెడ్డిలు హాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలంతా భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరారు.వారు చేసే ఉప వాస దీక్షతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.శివుని అనుగ్రహంతో ప్రజలకు పాలన,సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అద్భుతంగా అందుతున్నాయని అన్నారు. మహా శివుని మనసారా వేడుకొంటున్నానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.ఆ పరమశివుని ఆశీస్సులతో జిల్లాలోనే మహేశ్వరం అభివృద్ధిలో ఆదర్శంగా ఉండాలని తెలిపారు.ప్రజలు సుఖ, శాంతులతో ఆనందంగా ఉండాలని చెప్పారు.



నానమ్మతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న శ్రేయాన్



శ్రేయాన్‌తో కేక్ కట్ చేయిస్తున్న తల్లిదండ్రులు

## ఘనంగా శ్రేయాన్ జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్, మార్చి 7(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ రిపోర్టర్ వర్కాల చందు పెద్ద కుమారుడు శ్రేయాన్ 9 వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభావంగా జరిగాయి. గురువారం మార్కండేయ నగర్ లోని ఆయన నివాసం లో ఘనంగా కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలలో అమ్మ రాధికా, నాన్న చందు లు శ్రేయాన్ చేత కేక్ కట్ చేయించి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో నానమ్మ అమృతమ్మ, అత్త సునీత, తమ్ముడు ఆర్థిక్, బావ కీర్తన్, వదిన ప్రతీక లు పాల్గొన్నారు.



జాతీయ వరి పరిశోధన సంస్థలో మహిళలు తయారు చేసిన వంటలను రుచి చూస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ మీనాక్షి రామన్ సుందరం




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐ ఐ ఆర్ ఆర్‌లో చీరలను విక్రయిస్తున్న మహిళా సిబ్బంది



మహిళా సిబ్బందికి సర్టిఫికేట్ ల బహుకరణ

# ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్

## పట్నం సునీత మహేందర్ రెడ్డి, వి.జగదీశ్వర్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 7 (ప్రభాత ఉదయం) అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ బస్తీలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు,మహిళల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో వికారాబాద్ జిల్లా ఛైర్పర్సన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు .పట్నం సునీత మహేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ముందుగా బాబు జగ్జీవన్, డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళ సోదరీమణులందరికి, ప్రపంచ మహిళ సోదరిమనులందరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అద్భుతమైన సంక్షేమ, సంరక్షణ, కార్యక్రమాల నేపథ్యంలో మహిళ దినోత్సవ సంబరాలను అంబరాలు తాకేలా ఘనంగా నిర్వహించుకోవలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇప్పటికే అమలు చేసిందని, ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద ఇల్లు లేనివారికి ఇంటి స్థలం, రూ.5 లక్షల రూపాయల సాయం అందచేయడం జరుగుతుందని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.2500 ఆర్థిక సహాయం, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు 250 చదరపుగజాల ఇంటి స్థలం,చేయూత పథకం కింద నెలకు 4000 రూపాయల పింఛన్ , దివ్యాంగులకు 6000 రూపాయల పెన్షన్లను ప్రభుత్వం త్వరలో అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ జేరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి కార్డినేటర్ రఘునందన్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు,నల్ల సంజీవ రెడ్డి, వీరేందర్ గౌడ్,మనెపల్లి సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, ఇలియస్ షరీఫ్, సురేష్ నాయక్, ఏకాంత్ గౌడ్, ఇస్మాయిల్, బాష్పక యాదగిరి, భారత్, బసంత్ రాజ్, కరుణాకర్ రెడ్డి, రాజన్,శ్రీహరి,బాసిపక యాదగిరి,సురేశ్ నాయక్, శశి, రవి, వాసు, సంగమేష్, శ్రీనివాస్ బాబు,సయ్యద్, నాయక్, రెహ్మాన్,రాజా,రూబీన్,బాలు,చంద్రన్న,శ్రీను,అత్తరసింగ్,ప్రలీత్,సంపత్‌రాద్,రవి,రఫిక్,మాజర్,మౌలానా,శ్రీనివాస్,రంగారెడ్డి జిల్లా మహిళ అధ్యక్షురాలు జయమ్మ,మహిళ నాయకురాలు మాజీ కౌన్సిలర్ సునీత రెడ్డి,నాగమణి,కల్పన,శిరీష సతూర్, శ్రీదేవి,వసంత,మనెమ్మ,శ్రీలక్ష్మీ,మౌనిక,లీల,విజయపద్మావతి, శాంత, పార్వతి, రాణి,విజయమ్మ,మనెమ్మ,భాగ్యలక్ష్మి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మహిళా నాయకులు,కాంగ్రెస్ పార్టీ డివిజన్ కమిటీల నాయకులు,అనుబంధ కమిటీ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు,పార్టీ శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కొనమల్ల భారతమ్మ

# ఆర్.బి నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

## కోనమోల్ల భారతమ్మ

శంషాబాద్, మార్చి 7, (ప్రభాత ఉదయం) ఆర్ బి నగర్ ప్రజలకు కనీస వసతులు కల్పించి మున్సిపాలిటీలోనే ఆదర్శంగ తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని స్థానిక కౌన్సిలర్ కోణమోల భారతమ్మ పేర్కొన్నారు. హెచ్ఎండిఏ నిధుల ద్వారా ఆదర్శ కాలనీ. ఆర్.బి నగర్. హుడా కాలనీ లలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను గురువారం అనే ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వచ్చే నిధులను రాబట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఆర్ బి నగర్ లో ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ. సిసి రోడ్లు మంచినీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి. అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో పెద్ద ఎత్తున నిధులు సమకూర్చి పనులను చేపట్టి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కో ఆప్షన్ నెంబర్ సంతోష ప్రభాకర్. స్థానిక నాయకులు పరంధాములు. చంద్ర చారి. అనంతయ్య. సంపంగి వెంకటేష్ రమేష్ రాథోడ్. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నారాయణ పాఠశాల వార్షికోత్సవం

## విద్యార్థిని, విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాలలో రాణించాలి:ఏసిపి హనుమంతరావు, ఏజీఎం వేణుగోపాలరావు.



కూకట్‌పల్లి,మార్చి7 (ప్రభాత ఉదయం) ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాలలో రాణించి భారతదేశానికి వన్నె తీసుకురావాలని బాలానగర్ ఏసిపి హనుమంతరావు, నారాయణ స్కూల్ ఏజీఎం వేణుగోపాలరావు అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ వివేకానంద నగర్, మాధవరం కాలనీ లోగల నారాయణ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో గురువారం ఆశోక గార్డెన్ లో ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ వేడుకలకు, బాలానగర్ ఏసిపి హనుమంతరావు, కూకట్ పల్లి నారాయణ స్కూల్ విద్యాసంస్థల ఏజీఎం వేణుగోపాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, నృత్య ప్రదర్శన తో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకర్షించాయి. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యకలాపాలు, క్రీడ రంగాలలో రాణించి ఇటు దేశానికి పేరు తెచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనిఅన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ను పాఠశాల నిర్వాహకులు మెమోంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఒబేదుల్ల కోత్వాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యేన్నం

# నిస్వార్థపరుడు ఒబేదుల్లా కోత్వాల్

## కోత్వాలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

సిటీ బ్యూరో,మార్చి7(ప్రభాత ఉదయం) నిస్వార్థపరుడు, క్రమశిక్షణ గల నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ ఒబెదుల్లా కొత్వాల్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ హజ్ హౌస్ లో ఒబెదుల్లా కొత్వాల్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. కొత్వాల్ పేద మైనారిటీ వర్గాలను ఆదుకుని, మైనార్టీ సంక్షేమానికి పాటుపడతారని కొనియాడారు. కొత్వాల్ మాట్లాడుతూ%ా% మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవి రావడంతో రాష్ట్రంలో మహబూబ్ నగర్ గౌరవం పెరిగిందని, చైర్మన్ పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేస్తానని, నమ్మిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, అందుకు నిదర్శనం తానేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి, వినోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, లక్ష్మణ్ యాదవ్, అవేజ్, సునీల్, ఇమ్రాన్, సల్మాన్, తహెర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా పెద్ద షాపూర్ శ్రీ శివ రామాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు ప్రత్యేక పూజలు.



శంషాబాద్. మార్చి 7. ప్రభాత ఉదయం. శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ శివ రామాంజనేయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నాలుగు రోజులపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఊపు ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పూజా కార్యక్రమంలో భాగంగా గురువారం రుద్ర హెూమం. మృత్యుంజయ హెూమం. నవగ్రహ హెూమం. మండప దేవతల హెూమం నిర్వహించారు. శుక్రవారం శివపార్వతుల కళ్యాణ మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు చెక్కల ఎల్లయ్య ముదిరాజ్. ఉపాధ్యక్షుడు గూడ రఘువీర్ పండిత్. ప్రధాన కార్యదర్శి గాదె రాజశేఖర్. ఉప కార్యదర్శి దేవులపల్లి సత్యనారాయణ గౌడ్. కోశాధికారి గండ్రాతి కృష్ణారావు తెలిపారు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

# జాతీయ రహదారిని ఆక్రమిస్తున్న పట్టించుకోని అధికారులు

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్, నేషనల్ హైవే అధికారులు






జాతీయ రహదారిపై అక్రమంగా వెలసిన నిర్మాణాలు

శంషాబాద్, మార్చి 7, (ప్రభాత ఉదయం) హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని తొండుపల్లి. కిషన్ గూడా వద్ద రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేస్తున్న ఇటు నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఆటో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండా పరమేష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న అక్రమ వ్యాపార సముదాయాలను వెంటనే తొలగించాలని కొండ పరమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఓవైపు జాతీయ రహదారి విస్తరణ పనులు నడుస్తుండగా మరోవైపు రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న డబ్బాల కారణంగా ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిషన్ గూడా లోని టోల్ ప్లాజా దగ్గర నుండి తొండుపల్లి బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో డబ్బాలను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పరమేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా రోడ్లపై అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్కు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నదని ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య వర్ణనాతీతంగా ఉన్నదని అన్నారు. మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకొని పక్షంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని పరమేష్ గౌడ్ హెచ్చరించారు. ఇరుకుగా ఉన్న రోడ్ల పక్కనే డబ్బాలను ఏర్పాటు చేయడంతో అక్కడ టిఫిన్లు చేయడానికి టీ తాగడానికి ఇతర వ్యాపారాల కోసం వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతున్నదని అన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పరమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.



# శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు

శంషాబాద్. మార్చి 7. ప్రభాత ఉదయం. శంషాబాద్ ఇన్స్పెక్టర్ గ నియమితులై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ రెడ్డి ని భీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడిగంటి చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గురువారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నీరటి రాజు ముదిరాజ్. దిద్యాల శ్రీనివాస్. నరేందర్ రెడ్డి కి పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. .శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సీనియర్ నాయకులు కొడావత్ రవీందర్ నాయక్. రాము నాయక్. మోహన్ నాయక్. నీరటి శేఖర్ ముదిరాజ్ చందన వెల్లి శ్రీనివాస్. నీరటి అశోక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

# కాంగ్రెస్ పార్టీవి భూటక హామీలు

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కూకట్‌పల్లి,మార్చి7 (ప్రభాత ఉదయం) ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని బూటకపు హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పి ప్రజల నుండి డబ్బులు వసూళ్లకి తెరలేపిన కాంగ్రెస్ పార్టీ నిరంకుశ, ద్వంద వైఖరికి నిరసనగా గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ కు నియోజకవర్గం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు నాయకులు కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలోకార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ , హమీద్ పటేల్ , దొడ్ల వెంకటేష్ గౌడ్ , శ్రీకాంత్ , మంజుల రఘునాథ్ రెడ్డి , 121 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోడి కూతకు ముందే కిక్కు

## సమయపాలనకు తూట్లు

## తెల్లవారుజాము నుంచే మద్యం విక్రయాలు

## చోద్యం చూస్తున్న అధికారులు



మహబూబ్ నగర్,మార్చి7(ప్రభాత ఉదయం)కోడి కూతకు ముందు నుంచే మద్యం దుకాణాల వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్ లలో సమయపాలనకు తూట్లు పొడుస్తూ నిర్వాహకులు మద్యం ప్రియులకు మద్యం విక్రయిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెల్లవారుజాము నుంచే మద్యం లభిస్తుండడంతో కూలీనాలీ చేసుకునే మందుబాబులు మందు తాగేసి పనులకు వెళ్లడం లేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. సాదారణంగా మద్యం షాపుల వద్ద మద్యం ప్రియులు మద్యం సేవించడానికి పర్మిట్ రూమ్ లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలతో పాటు పర్మిట్ రూమ్ లలో మద్యం సేవించడానికి అవకాశం కల్పించింది. కాని నిబంధనలకు విరుద్దంగా తెల్లవారుజామున నుంచే పర్మిట్ రూమ్ ల వద్ద నిర్వాహకులు మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఓ వైన్‌షాప్ పక్కన గల పర్మిట్ రూమ్ వద్ద నిర్వాహకులు సమయపాలనకు తూట్లు పొడుస్తూ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మద్యం షాప్‌లు, పర్మిట్ రూమ్ లపై ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఓబెదుల్లా కొత్వాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ చైర్మన్ సరిత

# మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ చైర్ పర్సన్

గద్వాల,మార్చి7(ప్రభాత ఉదయం)హైదరాబాద్ లో తెలంగాణ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఒబెదుల్లా కొత్వాల్ కు గురువారం గద్వాల జెడ్పీ చైర్ పర్సన్ సరిత పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.